నమస్తే తెలంగాణ
హైదరాబాద్
హైదరాబాద్- మేడ్చల్
I హైదరాబాద్, సోమవారం 9 డిసెంబర్ 2024 HYDERABAD



ఎర్రవెల్లిలో జరిగిన బీఆర్ఎస్ శాసనసభా పక్ష సమావేశంలో పాల్గొన్న జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్.. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. నేటి నుంచి జరగనున్న అసెంబ్లీ సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై పార్టీ అధినేత కేసీఆర్ తమకు దిశానిర్దేశం చేశారని ఎమ్మెల్యే మాగంటి తెలిపారు.
బంజారాహిల్స్,డిసెంబర్ 8:

# ఫోన్‌లోనే పెండ్లి!

## సిటీలో మళ్లీ పడగవిప్పుతున్న కాంట్రాక్ట్ మ్యారేజెస్

- యాక్టివేట్ అయిన బ్రోకర్ వ్యవస్థ
- పేదరికంలో ఉండే యువతులు, మహిళలే టార్గెట్
- విదేశాల నుంచి వీడియో కాల్స్‌లో వారితో మాట్లాడిస్తూ.. ఒప్పందాలు
- విదేశాలకు మహిళల అక్రమ రవాణా

సిటీబ్యూరో: సిటీలో కాంట్రాక్ట్ పెండ్లీలు మళ్లీ మొదలవుతున్నాయి. ఫోన్ల ద్వారానే ఈ పెండ్లీలు జరుగుతున్నట్లు సమాచారం. విదేశాల్లో ఉండే బ్రోకర్లు, ఇక్కడుండే బ్రోకర్ల ద్వారా పేదరికంతో ఉన్న మహిళలు, యువతులను ఈ కాంట్రాక్ట్ పెండ్లీల ద్వారా ఆకర్షిస్తున్నారు. ఇదంతా అంతర్జాతీయ స్థాయిలో మానవ అక్రమ రవాణా జరుగుతుందనే ఆరోపణలు వస్తున్నాయి. ఓల్డ్‌సిటీకి చెందిన ఓ న్యాయవాది ఈ విషయంపై సీబీఐ దర్యాప్తు చేయాలని డిమాండ్ చేశారు. పేదరికాన్ని ఆసరాగా చేసుకుంటున్న ఏజెంట్లు ఈ వ్యవహారాన్ని గుట్టుచప్పుడు నడిపిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు కొందరు భయపడుతున్నట్లు సమాచారం.



### ఉక్కుపాదంతో అణిచివేసిన బీఆర్ఎస్ సర్కారు..

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ప్రారంభమైన ఈ కాంట్రాక్ట్ మ్యారేజ్‌ల వ్యవహారాన్ని గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఉక్కుపాదంతో అణిచివేసింది. దీంతో పదేండ్లు హైదరాబాద్ వైపు ఈ కాంట్రాక్ట్ మ్యారేజ్‌ల బ్రోకర్లు కన్నెత్తి చూడలేదు. ఇప్పుడు మళ్లీ బ్రోకర్లు తమ కాంట్రాక్ట్ మ్యారేజ్‌ల వ్యవహారాన్ని తిరిగి ప్రారంభించారని చర్చ జరుగుతున్నది. గతంలో మొదట పోలీసులకు ఫిర్యాదులు రాకున్నా, ఈ కాంట్రాక్ట్ పెండ్లిండ్లకు సంబంధించిన వ్యవహారంపై లోతైన దర్యాప్తు జరిపి బాధితులను గుర్తించి బ్రోకర్లు, పెండ్లి చేసుకున్న విదేశీయులను, కొందరు స్థానికంగా ఉండే ఖాజీలతో పాటు, ముంబైలోని ఖాజీలను సైతం అరెస్ట్ చేశారు. ఇలా కాంట్రాక్ట్ పెండ్లీలకు హైదరాబాద్‌లో తావు లేదని అప్పటి పోలీసు అధికారులు బ్రోకర్లకు గట్టి వార్నింగ్ ఇవ్వడంతో పాటు తెలంగాణ వ్యాప్తంగా విదేశీయులతో కాంట్రాక్ట్ మ్యారేజెస్‌ను అణిచివేశారు. ఈ ఏడాది ప్రభుత్వం మారడంతో కాంట్రాక్ట్ పెండ్లీలకు సంబంధించిన నెట్ వర్క్ యాక్టివేట్ అయింది.

### వీడియో కాల్స్‌తో...

ఇప్పుడు బ్రోకర్ నెట్‌వర్క్ తిరిగి యాక్టివ్ అవుతున్నది. ఇందులో భాగంగా నేరుగా కాంట్రాక్ట్ పెండ్లి కోసం హైదరాబాద్‌కు షేక్స్ వస్తే ప్రమాదమని, పోలీసులకు దొరికితే అరెస్ట్ అవుతారని భావించారు. దీంతో అక్కడుండే బ్రోకర్లు గతంలో బ్రోకర్లుగా పనిచేసిన నెట్‌వర్క్‌లోని వారిని సంప్రదిస్తున్నారు. తలాబ్‌కట్ట, తీగల్‌కుంట, ఫలక్‌నుమా, షాహీన్‌నగర్, రాజేంద్రనగర్ వంటి ప్రాంతాల్లోని పాత గ్యాంగ్‌లను సంప్రదిస్తున్నారు. అక్కడ కాంట్రాక్ట్ పెండ్లి కావాల్సిన వారు సిద్ధంగా ఉండగానే, ఇక్కడ పేదరికంలో ఉండే యువతి, భర్త చనిపోయిన వారిని గుర్తించి వారికి కావాల్సిన ఆర్థిక సహాయానికి సంబంధించిన అన్ని విషయాలు మాట్లాడుకుంటున్నారు. ఆ తరువాత విదేశాల నుంచి వీడియో కాల్‌లో యువతి, మహిళలతో మాట్లాడిస్తూ, ఫోన్‌లోనే కాంట్రాక్ట్‌లు రాసుకుంటున్నారు. ఆ తరువాత విజిటింగ్ వీసా ఇప్పించి ఆయా దేశాలకు బాధితులను రప్పించుకుంటున్నట్లు సమాచారం. కాగా తమకు ఎలాంటి ఫిర్యాదులు రాలేదంటూ పోలీసులు ఈ విషయాన్ని పక్కన పెట్టేస్తున్నారు. క్షేత్ర స్థాయిలో ఏమి జరుగుతుంది.. గతంలో అరెస్టయిన బ్రోకర్లు, గల్ఫ్‌దేశాలకు వెళ్లే వారిలో అనుమానాస్పదంగా కన్పిస్తే అలాంటి వారిని ప్రశ్నిస్తే ఈ కాంట్రాక్ట్ మ్యారేజ్‌లకు సంబంధించిన గుట్టు బయటకు వచ్చే అవకాశాలున్నాయి.. దీనిపై పోలీసులు ఫోకస్ పెట్టాల్సిన అవసరముందని ప్రజలు సూచిస్తున్నారు. ఈ విధానంతో మహిళలను అక్రమ రవాణా చేస్తున్న ముఠాలు రంగంలోకి దిగాయని, దీనిపై సీబీఐ ద్వారా విచారణ జరిపితే అంతర్జాతీయ స్థాయిలో జరుగుతున్న ఈ వ్యవహారం వెలుగులోకి వస్తుందంటూ ఓల్డ్‌సిటీకి చెందిన న్యాయవాది డిమాండ్ చేశారు.

### వివాహాల నుంచి కాంట్రాక్ట్ వరకు ..

బార్కాస్‌లో ఉన్న చాలా మంది ఒమన్ దేశం నుంచి వచ్చిన వారున్నారు. ఈ క్రమంలో 1970-80 దశకంలో ఒమన్ దేశస్తులు, హైదరాబాద్‌లోని బార్కాస్ ఇతర ప్రాంతాల్లో ఉండే వారి బంధువులను ఆరా తీసి పెండ్లిండ్లు చేసుకునేవారు. ఆ తరువాత తెలిసిన వారి ద్వారా గల్ఫ్ దేశాల్లో ఉండే వారు వివాహాలు చేసుకుంటూ ఆ నెట్‌వర్క్‌తో హైదరాబాద్‌లో ఉండే వారిని గల్ఫ్ దేశాలకు రప్పించుకునే వారు. ఈ క్రమంలోనే ఒమన్, ఖతర్, యూఏఈ తదితర దేశాల్లో డబ్బుండి, వయస్సు ఎక్కువగా ఉండే వారికి కాంట్రాక్ట్ పద్ధతిలో వివాహాలు చేసేందుకు బ్రోకర్ల వ్యవస్థ ప్రారంభమైంది. విదేశాల్లో ఉండే డబ్బున్న వారికి, హైదరాబాద్ పరిసరాల్లో పేదరికంలో ఉండే మహిళలు, యువతులు, బాలికల కుటుంబాలకు డబ్బు ఎర చూపుతూ కాంట్రాక్ట్ వివాహాలు ఈ బ్రోకర్ వ్యవస్థ చేస్తూ వచ్చింది. విదేశాల్లో ఉండే ఏజెంట్లు, హైదరాబాద్‌లో ఉండే వారి నెట్‌వర్క్‌లోని ఏజెంట్లకు ఫలాన షేక్‌కు కాంట్రాక్ట్ పెండ్లి కావాలి..తగినంత డబ్బిస్తాడంటూ ఆఫర్ ఇవ్వడంతో అమ్మాయిలను, వితంతువులను ఇక్కడుండే వారు చూసి పెట్టేవారు. ఆయా దేశాల నుంచి ఇక్కడికి వచ్చి గుట్టుచప్పుడు కాకుండా కాంట్రాక్ట్ వివాహాలు చేసుకొని విదేశాలకు వెళ్లేవారు. విదేశాలకు వెళ్లిన తరువాత కొన్నాళ్లు బాధితురాలితో బాగుండి, ఆమెను వదులుకునేందు చాలా మంది చిత్రహింసలకు గురిచేసేవారు. మరికొందరు అక్కడకు తీసికెళ్లి వ్యభిచార గృహాలకు అమ్మేయడం వంటి ఘటనలు జరిగేవి.




# పల్లెవాసికి పన్నుపోటు

## పల్లెకు దూరమై.. బతుకు భారమై..

- విలీన గ్రామాల ప్రజలపై పన్నుల పిడుగులు
- సొంతింటికి గుదిబండలా మారనున్న ఆస్తి పన్ను
- కిల్లీ కొట్టు నుంచి కిరణాకొట్టు వరకు తప్పని లైసెన్స్
- ఖాళీ స్థలాల నుంచి కటింగ్ షాపుల వరకు పన్నులు
- అరకొర వసతులు.. అధిక మొత్తంలో పన్నులు

హైదరాబాద్ సిటీబ్యూరో, డిసెంబర్ 8(నమస్తే తెలంగాణ): చాలీచాలనీ జీతాలు.. కూలీ నాలీ చేసుకుని కుటుంబాన్ని పోషించుకునే పేదలకు ఆ పల్లెలే ప్రపంచం. ఇన్నాళ్లు ఉన్నది తిని.. తృప్తిగా బతుకుతున్న పేదోడిని ఆర్థికంగా నలిపేందుకు కాంగ్రెస్ సర్కారు సిద్ధమైంది. గ్రేటర్ చుట్టూ ఉన్న ఔటర్ లోపల విస్తరించి ఉన్న 51 గ్రామాల పల్లెవాసుల జేబులను పన్నులతో కొల్లగొట్టేందుకు సమాయత్తమవుతున్నది. పల్లెలకు దూరమై పురపాలికల్లో చేరుతున్న ప్రజలకు ఆస్తి పన్ను గుదిబండలా మారనున్నది. పొట్ట కూటి కోసం పెట్టుకునే కిల్లీ కొట్టు నుంచి కిరణాకొట్టు వరకు ట్రేడ్ లైసెన్సులు తప్పనిసరికానున్నాయి. మున్సిపాలిటీల్లోకి మారిన తర్వాత ఇంటికే కాదు.. ఇంటి పక్కన ఉండే ఖాళీ స్థలాలకు కూడా పన్నులు వసూలు చేసి రేవంత్ సర్కారు ఖజానా నింపుకోనున్నది.

### ఆస్తి పన్ను...మూడింతలు

గ్రామాలను మున్సిపాలిటీల్లో విలీనం చేయడం వల్ల ముందుగా పేదోడిపై ఆస్తి పన్ను భారం పడనున్నది. వీటితోపాటు ట్రేడ్ లైసెన్స్, మున్సిపాలిటీ నల్లా నీళ్లు, వేకెట్ ల్యాండ్ ట్యాక్స్ పేరిట మరిన్ని పన్నుపోటులు పడనున్నాయి. ఒక్కో ఇంటిపై అదనంగా ఏటా పన్నుల రూపంలో రూ. 5వేల నుంచి 10వేల వరకు ప్రభుత్వం ముక్కు పిండి వసూలు చేయనున్నది. గ్రామాల్లో ప్రస్తుతం చదరపు గజానికి ఇంటి విలువలో 0.15 నుంచి 1 శాతం మేర పన్ను వసూలు చేస్తుండగా.. మున్సిపాలిటీల్లో చేరగానే అదే ఇంటికి చదరపు అడుగుకు రూ. 10-50 చొప్పున వసూలు చేస్తారు. 150 గజాల ఇంటికి ఏటా సుమారు రూ. 6వేల నుంచి 8వేలు వరకు ఆస్తి పన్ను చెల్లించాల్సిన దుస్థితి రానున్నది. ఒకవేళ నిర్మాణంలో జరిగే చిన్న చిన్న లోపాలను కూడా పరిగణనలోకి తీసుకుని అనధికారిక నిర్మాణం(యూసీ) ట్యాక్స్ పేరిట ఇంటి పన్ను మొత్తానికి సమానంగా ఏటా పెనాల్టీ విధించనున్నది. అదే గ్రామాల్లో రోడ్లకు ఇరువైపులా నిర్మించుకునే కమర్షియల్ బిల్డింగులపై ఇకపై రెండింతల మొత్తంలో ఆస్తి పన్ను చెల్లించాల్సి వస్తే, దానిలో నిర్వహించుకునే దుకాణాలు, షాప్‌లకు అదనంగా రూ.3వేల నుంచి రూ. 50వేల వరకు ట్రేడ్ లైసెన్స్ పేరిట స్థానిక మున్సిపాలిటీలు వసూలు చేయనున్నాయి.

### 150 గజాల ఇంటిపై పడే పన్ను

ప్లాట్ ఏరియా 150 గజాలు(రెసిడెన్షియల్)

| | గ్రామాలు | మున్సిపాలిటీలు |
|---|---|---|
| ఇంటి పన్ను | 2273 | 6336 |
| లైబ్రరీ సెస్ | 182 | 0 |
| డ్రైనేజీ | 0 | 0 |
| లైటింగ్ | 0 | 0 |
| వాటర్ | 0 | 0 |
| ఎల్‌సీఎస్ | 0 | 254 |
| మొత్తం | 2455 | 6590 |

### ఖాళీ స్థలాల నుంచి

గ్రామాల్లో ఖాళీ స్థలాలపై ఎలాంటి పన్నులు చెల్లించాల్సిన అవసరం లేదు. కానీ మున్సిపాలిటీల్లో ప్లాట్ ధరలో 0.5-0.8 వరకు పన్నులు వసూలు చేస్తున్నారు. ఈ లెక్కన 100 గజాల ఖాళీ ఇంటి జాగపై కనీసం మున్సిపాలిటీల్లో రూ. 480-1015 వరకు చెల్లించాల్సి ఉంటుంది. ఒక్కో ఇంటిపై ఏడాదికి కనీసం రూ. 5వేల నుంచి రూ. 10వేల పన్ను భారం పడనున్నది. గ్రామాల్లో ఉపాధి నిమిత్తం నిర్వహించుకునే హెయిర్ కటింగ్, ఇస్త్రీ దుకాణాలకు ట్రేడ్ లైసెన్స్‌లో కొన్ని మినహాయింపులు ఉన్నాయి. మున్సిపాలిటీల్లో ఎవరికీ మినహాయింపుల్లేవు.

### పల్లె సౌలతులు... బల్దియా పన్నులు

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత పల్లెల్లో మౌలిక వసతుల కల్పన, అభివృద్ధి పూర్తిగా కుంటుపడింది. ఇన్నాళ్లు గ్రామాల్లో ఉన్న సౌలతులకు తగినట్టుగానే పన్నులు చెల్లిస్తూ వచ్చారు. ఇప్పుడు పల్లెలు, తండాలు, హామ్లెట్ విలేజీలను మున్సిపాలిటీల్లో విలీనం చేయడం వల్ల పల్లె వసతులకే.. టౌన్ తరహా ట్యాక్సులు అదనంగా చెల్లించాల్సి రానున్నది. మున్సిపాలిటీల్లో మారగానే ఒక్కసారి మౌలిక వసతులు అభివృద్ధి చేసే వీలు లేదు. కానీ పల్లె జనాల నుంచి పన్నుల రూపంలో భారీ మొత్తంలో వసూలు చేసి కాంగ్రెస్ సర్కార్ ఖజానా నింపుకోనున్నది. ఇలా పల్లెకు దూరమై మున్సిపాలిటీల్లో కలుస్తున్న గ్రామీణవాసులపై కాంగ్రెస్ ప్రభుత్వం పన్నుపోటు పొడవనున్నది.

### గ్రామాల్లో పన్నుల శాతం

- ప్రాపర్టీ ట్యాక్స్ 0.15% నుంచి 1 శాతం
- లైబ్రరీ సెస్ 8 శాతం ఇంటి పన్నుపై
- డ్రైనేజీ ట్యాక్స్ 0
- లైటింగ్ ట్యాక్స్ 0
- వాటర్ ట్యాక్స్ 0



### 200 గజాల్లో నిర్మించిన షాప్‌పై పడే పన్ను

ప్లాట్ ఏరియా 250 గజాలు(కమర్షియల్ ప్రాపర్టీ)

| | గ్రామాలు | మున్సిపాలిటీలు |
|---|---|---|
| ఇంటి పన్ను | 4388 | 9240 |
| లైబ్రరీ సెస్ | 351 | 0 |
| డ్రైనేజీ | 0 | 0 |
| లైటింగ్ | 0 | 0 |
| వాటర్ | 0 | 0 |
| ఎల్‌సీఎస్ | 0 | 370 |
| మొత్తం | రూ. 4739 | రూ. 9610 |

### గ్రామాల్లో ట్రేడ్ లైసెన్స్ చార్జీలు...

షాప్‌లపై...
షాప్ రూ.900-1500

### మున్సిపాలిటీల్లో ట్రేడ్ లైసెన్స్ పన్నులు...

- చదరపు అడుగుకు (సింగిల్ రోడ్డు) రూ. 3/-
- చదరపు అడుగుకు (డబుల్ రోడ్డు) రూ. 4/-

1000 చదరపు అడుగుల్లో ఉండే షాప్‌పై

- చదరపు అడుగుకు (సింగిల్ రోడ్డు) రూ. 3వేల నుంచి 10వేల లోపు
- చదరపు అడుగుకు (డబుల్ రోడ్డు) రూ. 4వేల నుంచి 50వేల లోపు

### కోకాపేట.. ఆశల మేడ

భూముల వేలంపై గంపెడాశలు

సిటీబ్యూరో: భూముల వేలానికి వ్యతిరేకం అంటూ నానా రాద్ధాంతం చేసిన కాంగ్రెస్ పార్టీయే... అధికారంలోకి వచ్చిన తర్వాత కోకాపేట భూములపై ఆశల మేడలను కట్టుకుంటున్నది. అందుకు విలువైన కోకాపేట్ భూములను విక్రయించాలని హెచ్‌ఎండీఏను పురమాయిస్తున్నది. 500 ఎకరాల విస్తీర్ణంలో అత్యాధునిక మౌలిక వసతులతో కోకాపేట్ నియోపోలిస్ ప్రాజెక్టును చేపట్టింది. అయితే ఇందులో మరో 24 ఎకరాల్లో అభివృద్ధి చేసిన ప్లాట్లు అందుబాటులో ఉండటంతో... వీటిని తాజాగా విక్రయించాలని భావిస్తున్నది. కోట్లు కురిపించిన కోకాపేట్ భూముల్లో మిగిలిన 24 ఎకరాల డెవలప్‌మెంట్ పనులు చకచకా సాగుతున్నాయి. ఈ క్రమంలో ప్లాట్లను అభివృద్ధి చేస్తూనే మార్కెట్లోకి తీసుకు రావాలని ప్రభుత్వం యోచిస్తున్నది. ప్రభుత్వానికి నియోపోలిస్ వెంచర్ ద్వారా అంచనాల మేర ఆదాయం వస్తుందని అధికారులు భావిస్తున్నారు. ఈ క్రమంలో ఈ ప్రాజెక్టును వేలం వేసేందుకు ఏర్పాట్లు చేసుకోవాలని హెచ్‌ఎండీఏను ప్రభుత్వం ఆదేశించింది. ఇప్పటికే వెంచర్ పరిధిలో అభివృద్ధి పనులు సాగుతుండగా... 24 ఎకరాల పరిధిలో పనులు చివరి దశకు చేరుకోవడం కొత్త ఏడాదిలో విక్రయానికి సిద్ధం కానున్నాయి. 24 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ప్లాట్లను విక్రయిండం ద్వారా ప్రభుత్వానికి రూ. 1500 కోట్లకు పైగా ఆదాయం సమకూరుతుందని అంచనా వేశారు.



# వేడుకకు వేళాయె

- తెలంగాణ తల్లి విగ్రహం సైతం ఆవిష్కరణ
- భారీగా తరలిరానున్న బీఆర్ఎస్ శ్రేణులు, అభిమానులు
- ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా సకల సౌకర్యాలు
- బహిరంగ సభలో ప్రసంగించనున్న కేటీఆర్

## మేడ్చల్ తెలంగాణ భవన్ ప్రారంభం నేడే

జిల్లా పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించనున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

మేడ్చల్/దుండిగల్/కేపీహెచ్‌బీకాలనీ: మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం ప్రారంభోత్సవానికి సర్వం సిద్ధమైంది. సోమవారం గండిమైసమ్మ సమీపంలో నిర్మించిన బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం ప్రారంభోత్సవంతో పాటు పార్టీ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరుకానున్నారు. జిల్లాలోని ఎమ్మెల్యేలతో పాటు రాష్ట్రంలోని వివిధ నియోజకవర్గాల ఎమ్మెల్యేలు, మాజీ ఎంపీలు, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొననున్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేలా జిల్లాలోని ఎమ్మెల్యేలతో పాటు బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు నాయకులతో సన్నాహక సమావేశాలు నిర్వహించి భారీ సంఖ్యలో బీఆర్ఎస్ శ్రేణులు, బీఆర్ఎస్ అభిమానులు తరలివచ్చేలా ప్రణాళికలను రూపొందించారు. రాష్ట్రంలోని ప్రజాప్రతినిధులు, రాష్ట్రనాయకులు తరలివస్తున్న నేపథ్యంలో ఏర్పాట్లను భారీ ఎత్తున చేశారు. బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం ప్రారంభించిన అనంతరం తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ తర్వాత కేటీఆర్ ప్రసంగించనున్నారు.

### సకల ఏర్పాట్లు

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా బీఆర్ఎస్ పార్టీ ప్రారంభోత్సవం అనంతరం బహిరంగ సభను నిర్వహించనున్నారు. ఈ క్రమంలో జిల్లాలోని మేడ్చల్, మల్కాజిగిరి, ఉప్పల్, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్ నియోజకవర్గాల నుంచి భారీ సంఖ్యలో బీఆర్ఎస్ శ్రేణులు తరలివస్తున్న నేపథ్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు. సుమారు 20 వేల పైచిలుకు బీఆర్ఎస్ శ్రేణులు వచ్చే అవకాశం ఉన్నందున వచ్చిన వారికి ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని రకాల సౌకర్యాలను కల్పిస్తున్నారు. వచ్చిన వాహనాలకు ప్రత్యేకంగా పార్కింగ్ స్థలం కేటాయించారు. వచ్చిన అతిథులు అందరికీ కనిపించే విధంగా వేదికను ఏర్పాటు చేశారు.

### విజయవంతం చేద్దాం..

బీఆర్ఎస్ కార్యాలయం ప్రారంభోత్సవం సందర్భంగా జరుగుతున్న ఏర్పాట్లను ఆదివారం ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ పరిశీలించారు. కార్యక్రమానికి వచ్చే వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసేలా సౌకర్యాలను కల్పించే విధంగా తగిన సూచనలు చేశారు. బీఆర్ఎస్ కార్యాలయ ప్రారంభోత్సవాన్ని విజయవంతం చేయాలని శంభీపూర్‌రాజు, కేపీ వివేకానంద్ పిలుపు నిచ్చారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన కార్పొరేటర్లు, కౌన్సిలర్లు, వివిధ విభాగాల అధ్యక్షులు, మాజీ ప్రజాప్రతినిధులు, నియోజకవర్గస్థాయి నాయకులు, ముఖ్యనాయకులతో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు, ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

### బీఆర్ఎస్ శ్రేణులు తరలిరావాలి

ఎమ్మెల్యే మాధవరం

మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం ప్రారంభోత్సవానికి కూకట్‌పల్లి నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ నేతలు భారీగా తరలిరావాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కోరారు. బీఆర్ఎస్ పార్టీ జిల్లా నూతన కార్యాలయాన్ని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రారంభిస్తారన్నారు. అనంతరం భారీ బహిరంగ సభ ఉంటుందన్నారు. కూకట్‌పల్లి నియోజకవర్గం పరిధిలోని ప్రజా ప్రతినిధులు, బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నేతలు, కార్యకర్తలు భారీగా తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

## రైల్వే చక్రబంధం నుంచి విముక్తి కల్పిస్తాం.. : ఎమ్మెల్యే మర్రి

మల్కాజిగిరి: మల్కాజిగిరి ప్రజలకు రైల్వే చక్రబంధం నుంచి విముక్తి కల్పిస్తామని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. ఆదివారం బోయిన్‌పల్లిలోని క్యాంప్ క్యాంప్ కార్యాలయంలో నేరేడ్‌మెట్ రైల్వే గేట్ వద్ద ఆర్‌యూబీని నిర్మించాలని నేతలు ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ గూడ్స్ రైళ్లతో పాటు లోకల్ రైళ్లు వెళ్తుండటంతో తరచూ గేట్లు మూసి వేయడంతో ఆర్టీసీ, ప్రైవేటు బస్సులతో పాటు కార్లు, ఆటోలు, బైకులు, ట్రాన్స్‌పోర్టు వ్యాన్‌లు నిలిచిపోతున్నట్లు గుర్తించామన్నారు. రైల్వే అధికారులతో సర్వే చేయించి కొత్తగా ఆర్‌యూబీలను నిర్మించడానికి ఆమోదం లభించిందని పేర్కొన్నారు. త్వరలోనే పనులు ప్రారంభిస్తామన్నారు.



ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న నేతలు